అయిదు రూపాయలకు ఒక పొట్లాన్ని చేతిలో పెట్టాడతను.

తండ్రితో ఒకసారి ద్రౌపది జాతరకు వెళ్ళినప్పుడు కొనుక్కుని తిన్న పులిహోర గుర్తుకొచ్చింది

హోటల్ కెళ్ళి తీరుబడిగా తినాలి. అప్పటికే అతను రాడని రూఢీ చేసుకున్న నిశాంత గబగబా మెట్లు దిగుతూ-

మెట్ల చివర చెట్టు కింద చలికి వణికిపోతూ, అర్ధనగ్నంగా కూర్చుని అడుక్కుంటున్న యాభై ఏళ్ళ వృద్ధురాలిని చూసింది.

ఆమె వైపు అడుగు వేసింది నిశాంత.

"ఇదిగో .......ఇది తీసుకో" వంగోని ఆమె చేతికి అందివ్వబోతూ ఆగిపోయింది నిశాంత.

అదే సమయంలో ఆ వృద్ధురాలి వంటిమీద ఎవరో శాలువా కప్పుతున్నారు.

చటుక్కున తలెత్తి చూసింది నిశాంత.

సిద్ధార్థ!

ఎప్పుడొచ్చాడు......ఎక్కడ్నించొచ్చాడు........ఎలా వచ్చాడు........నిశాంతలో రకరకాల ప్రశ్నలు. ఆశ్చర్యంగా చూస్తోంది.

"ఈ వృద్ధురాలికి మొదట కావల్సింది చలి నుంచి రక్షణ. కాదంటారా?"

ఈ ప్రశ్న తననే అని నిశాంత అర్థం చేసుకోడానికి కొన్ని నిమిషాలు పట్టింది.

తన మీద శాలువా కప్పిన సిద్ధార్థ వైపు, తన చేతిలో పొట్లాన్ని వుంచిన వైపు ఆశ్చర్యంగా చూసి-

అ పొట్లాన్ని ఆత్రంగా విప్పుకుంటోంది ఆ వృద్ధురాలు

"భారతదేశంలో ఎక్కడయినా రోటీ, కపడాబజార్ మకాన్. కానీ ఇక్కడ కాదు. ఎందుకంటారా........ఇది చలి ప్రదేశం ఇక్కడ ముందు కావల్సింది కపడా తర్వాతే రోటీ" విశాలమైన నిశాంత కళ్ళ వైపు సూటిగా చూసి ముందుకదుగేశాడు సిద్ధార్థ. అతని వెనక రఘువీర్.

ఏం చేయాలో పాలుపోలేదు ఆమెకు.

మళ్ళీ తను కొండెక్కితే? నో........కొండమీంచి తను రావడం చూసుకుంటాడు.

ఠీవిగా మెట్లెక్కుతున్న సిద్ధార్థ వైపు చూసి, అతని మాటల్ని గుర్తుకు తెచ్చుకుంటూ తను వ్యాన్ వైపు నడిచింది ఆమె.

ఆ వ్యాన్ కొంచెం దూరంలో బ్లూ కలర్ మారుతీ కారు.

చూశాడని ఆమెకు తెలీదు.

పక్కన రఘువీర్ లేకపోతే అతను వెంటనే వెనక్కి వచ్చేసే వాడాని తెలీదు.

నాలుగు వైపులా చూసింది ఆమె.

కారు దగ్గర కానీ, చుట్టుపక్కల కానీ ఎవరూ లేరు గబగబా కారు దగ్గరకెళ్ళి, ఫ్రెంట్ టైర్ గాలి తీసేసి తన వ్యాన్ ఎక్కి  వ్యాన్‌ని రోడ్డు పక్కన ఆవు చేసింది.

అయిదే అయిదు నిమిషాలు.

అతను అంత త్వరగా కిందకు వస్తాడని వూహించలేదు ఆమె.

నిశాంతను మరోసారి చూడాలనే ఉద్దేశంతోనే అతను గబగబా కింద కొచ్చేశాడని తెలీని నిశాంత-

తీవిగా తన కారు వైపు నడుచుకుంటూ వెళుతున్న సిద్ధార్థను చూసి మనసులోనే నవ్వుకుంది.

"ఎక్కడో టైర్ పంక్చరయ్యింది" రఘువీర్ అన్నాడు.  ఒకింత విచారంగా.

"ఇప్పుడెలా?" సిద్ధార్థ అలోచనలో పడ్డాడు.

ఆ సమయం కోసమే ఎదురుచూస్తోంది నిశాంత.

వ్యాన్ స్టార్ట్ సిద్ధార్థ పక్కన ఆపి  "కెన్ ఐ హెల్ప్ యూ?" అని అడిగింది.

రఘువీర్ భయంగా సిద్ధార్థ వైపు చూసి చుట్టూ చూశాడు.

చుట్టుపక్కల జనంలో మారువేషంలో సెక్యూరిటీ గార్డులున్నారని ఈ విషయం అనంతమూర్తికి తెలిస్తే తన ఉద్యోగం వూడటం ఖాయమని భయపడ్డ రఘువీర్......

"సిద్ధార్థబాబూ! అయిదు నిమిషాలలో మెకానిక్‌ను తీసుకొస్తాను-"

అతని నోటి నుంచి ఆ మాట బయటికొచ్చేలోపునే........

సిద్ధార్థ ముందుకు దూసుకుపోవటంతో రఘువీర్ గుండెలు గుబగుబలాడాయి.

*     *     *     *     *     *     *     *     *     *     *     *

సిద్ధార్థకు చాలా ఎక్సయిటింగ్‌గా వుంది

జీవితంలోమొట్టమొదటిసారి ఒక ఆడపిల్ల పక్కన కూర్చున్నందుకు.

నిశాంతకు చాలా గర్వంగా వుంది ముస్సోరీ వచ్చిన రెండోరోజునే అతన్ని అలా పట్టుకున్నందుకు.

గాలికి ఎగురుతున్న నిశాంత ముంగురులు సిద్ధార్థ ముఖమ్మీద పడుతున్నాయి.

అతని వంటికి రాసుకున్న యార్డ్‌లీ సెంటు పరిమళం మెత్తగా, మత్తుగా నిశాంత ముక్కు పుటాలకు తాకుతోంది.

అతని మనసులో ఎన్నో ప్రశ్నలు........ఒక్క ప్రశ్న కూడా బయటికి రావడంలేదు.

"ఒక ఆడపిల్లతో ఒక మగవాడు మొట్టమొదటి ఏంటాంటాడు?"
తీవ్రంగా ఆలోచిస్తున్నాడతను.

మీరెక్కడుంటారని అడిగితే? ఛ.........పోస్ట్‌మేన్ వేసినట్టుగా ఏంటా ప్రశ్న మరి?

"యూ ఆర్ సో బ్యూటిఫుల్.......బ్యూటిఫుల్" నిశాంత సూది ముక్కు వైపు, కనుబొమల వైపు చూస్తున్నాడతను.

ముందు పేరు కనుక్కోవాలి. తర్వాత.......తర్వాత...........

"మీ పేరు....." చిట్టచివరకు అడిగేశాడతను. ఆ ప్రశ్న అడుగుతున్నప్పుడు తన వంటికి అకస్మాత్తుగా చెమటలు ఎందుకు పట్టాయో అర్థం కాలేదతనికి

ఓరకంట చూసింది నిశాంత అతని వైపు.

"మీ పేరు?" ఎదురు ప్రశ్న వేసింది.

"సిద్దార్థ..........సిద్ధార్థ.......మ......." మహంత అని చెప్పబోయి ఆగిపోయాడు.

"ఏం చేస్తుంటారు?" మళ్ళీ నిశాంత.

ఆ నవ్వు చాలా నచ్చిందతనికి. ఎర్రటి పెదవుల వైపు ఆరాధనగా చూశాడు.

"అడిగింది మిమ్మల్నే?"

"నేనా? ఎమ్ ఎ. స్టూడెంటుని" అకస్మాత్తుగ అతని నోటివెంట ఒక అబద్ధం వచ్చేసింది

"ఎక్కడుంటున్నారు?"

"హాస్టల్లో."

అతను అంత గమ్మత్తుగా అబద్దాలు చెప్తాడని వూహించని నిశాంత ఆశ్చర్యపోయింది.

అతనిని ఇప్పుడు తనెక్కడకు తీసికెళుతుంది? నేరుగా హోటల్‌కి తీసికెళ్ళి పోతే? అతను వస్తాడా? హోటల్ కి తీసికెళ్ళి, దేశ్‌ముఖ్‌కి ఫోన్‌చేసి సిద్ధార్థతో మాట్లాడిస్తే?

ఢాం మనికిందపడిపోతాడు దేశ్‌ముఖ్.

"మీరు చాలా ఫాస్టుగా డ్రైవ్ చేస్తారనుకుంటాను.......మీ పేరు.........." స్టీరింగ్ వీల్ వైపు చూస్తూ అడిగాడతను

"నేను చాలా అందంగా వున్నాను కదూ? నన్ను చూడగానే మీరు ఇష్టపడ్డారు కదూ? నేనెక్కడుంటానో తెలుసుకోవాలని వుందికదూ? ఈమాటలన్నీ మీరు నాతో చెప్పాలనుకుంటున్నారు కదూ?" గబగబా, ఆల్లరిగా అడుగుతున్న నిశాంత వైపు ఆశ్చర్యంగా చూశాడతను.

"మీకు అలోపతి తెలుసా?" కంగారుగా అడిగాడతను.

"ఆలోపతి కాదు మహానుభావా.......టెలీపతి.....మీ గురించి తెలుసుకోవాలనుకుంటే ఏ పనీ అక్కర్లేదు...... మీ ముఖం ఒకసారి అద్దంలో చూసుకోండి. లేదా చేత్తో తడిమి

చూసుకోండి"

నెమ్మదిగా నవ్వుతూ అంది నిశాంత.

గిల్టీగా ముఖాన్ని తడుముకున్నాడతను

"అమ్మాయితో మాట్లాడటం ఇదే మొదటిసారా?" కారు ముస్సోరీ చేరడానికి కిలోమీటరు దూరంలో వుంది.

"కాదు .........రెండోసారి!"

"మొదటిసారి."

"టెంపుల్ దగ్గర మీతో మాట్లాడాను కదా?" ఆ తెలివితేటలకు ఆశ్చర్యపోయింది నిశాంత.

"ఇంతకీ మీ పేరు?" మళ్ళీ అడిగాడతను.

"మీ పేరు విక్రమార్కుడని పెట్టాల్సింది.........సిద్ధార్థ అని తప్పు పేరు పెట్టారు" అని నవ్వి........

"నా పేరు తెలుసుకోవాలంటే నేనడిగే ఒక ప్రశ్నకు జవాబు చెప్పాల్సి వుంటుంది...........చెప్తారా?" ఓరకంట చూస్తూ అడిగింది నిశాంత.

"అడగండి?"

"గ్రీక్ భాషలో ముప్పయ్ అక్షరాలు.....లాటిన్ భాషలో ఇరవయ్ అయిదు అక్షరాలు......ఇంగ్లీషులో నాలుగక్షరాల పదం ఏంటో చెప్పండి?"

అర్థం కాక మళ్ళీ అడిగాడతను. మళ్ళీ చెప్పింది నిశాంత.

"మనం సిటీలోని క్లాక్టవర్ దగ్గరికి చేరేసరికి చెప్పాలి....తెలిసిందా......" నిశాంత అలా అంటున్న సమయంలోనే నిశాంత మారుతీ వ్యాన్ చుట్టూ మూడు కార్లు వచ్చి ఆగాయి.

నిశాంత సడన్గా బ్రేక్ వేసింది.

ఆ కార్లను చూడగానే సిద్ధార్థ ముఖం వెల వెల బోయింది.

విండో మిర్రర్లోంచి ఆ ముఖంలోని భావాల్ని పరిశీలిస్తోంది నిశాంత.

"వ్యాన్ ఆపుచేయండి.......దిగిపోతాను" గిల్టీగా అన్నాడతను.

"ఎవరు వాళ్ళు?"

"మా హాస్టల్లో మా వార్డెన్ మహా స్ట్రిక్ట్" నసిగాడతను.

"నా ప్రశ్నకు జవాబు ఎప్పుడు చెపుతారు?" సూటిగా తన కళ్ళ వైపే చూస్తున్న నిశాంత వైపు చూడలేక తల దిం చుకుని వ్యాన్ దిగిపోయిమూడు కార్లలో ఒక కారెక్కడతను.

వెంటనే ఆ కార్లు అక్కడనుంచి మాయమైపోయాయి.

"సిద్ధార్థ దొరికావ్......ఇక నువ్వు తప్పించుకోలేవ్" గర్వంగా అనుకుని యాక్సిలేటర్ నొక్కింది నిశాంత.

మారుతీ వ్యాన్ దోర్క్ హోటల్కి చేరేసరికి ఇరవయ్ నిమిషాలు పట్టింది

*      *      *      *      *      *      *      *      *      *      *      *      *

వ్యాన్ పార్క్ చేసి, కౌంటర్లో కీస్ తీసుకుని సూట్లో అడుగు పెట్టింది నిశాంత.

టెలిఫోన్ గణగణ మోగింది. వెంటనే రిసీవర్ అంతదుకుంది.

“నిశాంతా హియర్”

“గుడ్ బేబీ......వెరీగుడ్” ఆ గొంతుని వినిఆశ్చర్యపోయింది నిశాంత.

దేశ్‌ముఖ్ గొంతు అది.

“రెండో రోజు నాటికే అతడ్ని ఎట్రాక్ట్ చేసినందుకు, నీ వ్యాన్‌లో ఎక్కించుకున్నందుకు కంగ్రాచ్యులేషన్స్ ........గో ఎహెడ్” అరగంట క్రితం జరిగిన సంఘటన బొంబాయిలోని దేశ్‌ముఖ్‌కి ఎలా తెలిసిందో అర్థం కాలేదు నిశాంతకు.

“మీకీ విషయం ఎలా తెలిసింది సార్!” ఆశ్చర్యంగా అడిగిందామె.

“ఆ ప్రశ్నకు నీకు ఇవాళ కాకపోతే రేపైనా జవాబు తెలుస్తుంది.....నీ ప్రోగ్రెస్ నువ్వు చూపెట్టావ్.....మరి నా ప్రోగ్రెస్ నేను చెప్పోద్దూ..........గంగిరెడ్డిపల్లెకి ఇవాళ ముగ్గురు వ్యక్తుల్ని పంపాను..........ఒక సివిల్ ఇంజనీర్, ఒక జియాలిజిస్ట్, ఒక హైడ్రాలిజిస్ట్ వాళ్ళు పంపే రిపోర్ట్ నాకో అయిదు రోజుల్లో అందుతుంది. ఆర్యూ హేపీ?” నవ్వాడు దేశ్‌ముఖ్

“థ్యాంక్యూ వెరీమచ్ సర్” ఆ మాట పూర్తవకుండానే నిశాంత అడిగింది.

“రేపటి నా ప్రోగ్రాం ఏంటి సార్? సిద్ధార్థను ఎక్కడ కలవమంటారు?”

నవ్వాడు దేశ్‌ముఖ్.

“అతన్ని కల్సుకోవాలని నీకూ ఆత్రంగా వున్నట్టుంది టుమారో ఈజ్ నో ప్రోగ్రామ్ ఎందుకో తెలుసా? అతను బయటకు రాడు........”

లైన్ కట్ అయింది. విస్తుపోవడం నిశాంత వంతమయింది.

అతను బయటకు రాడనే విషయం దేశ్‌ముఖ్‌కి ఎలా తెల్సు?

అ రోజు రాత్రి చాలా సేపటి వరకూ అతని గురించే ఆలోచించింది ఆమె.

*      *      *      *      *      *      *      *      *

రెస్టారెంటులోకి అడుగుపెట్టింది నిశాంత.

సప్లయర్ ఎవరో కస్టమర్‌తో గొడవపడుతున్నాడు తలెత్తి కార్నరులో వున్న ఆ సీటు వేపు చూసి తన రూమ్‌లో కెళ్ళిపోయిందామె.

ఆ సమయంలో మేనేజర్ లేడు. సప్లయర్ నేరుగా నిశాంత దగ్గర కొచ్చాడు.

“మేడమ్!” తలెత్తి చూసిందామె.

“ఆ కస్టమర్ డ్రింక్ సప్లయ్ చెయ్యమంటున్నాడు మేడమ్........ ఇక్కడ డ్రింక్స్ చెయ్యరని చెప్పాను మేడమ్.......బయట కెళ్ళి తెమ్మంటున్నాడు”

“ఎవరా కస్టమర్? బయటికెళ్ళిపోమ్మని చెప్పండి.... ఇది బార్ కాదని చెప్పండి”

అప్పటికే చెప్పింది నిశాంత.

అప్పుడే విసురుగా లోనికొచ్చిన ఆ వ్యక్తి వైపు చూసింది నిశాంత. అప్పటికే అతను బాగా తాగి వున్నాడని తెలుస్తూనే వుంది.

"ఇది బార్ కాదు.......వెళ్ళిపోండి" నెమ్మదిగా చెప్పింది నిశాంత.

"మాకు తెలుసు......ఇక్కడున్న ప్రతి హోటలూ ఒక బారే.......తెప్పించు" విస్కీతో గుప్పుమంటున్న ఆ వ్యక్తి హస్కీగా నవ్వుతూ అన్నాడు.

"షటప్! సప్లయర్.....ఇతన్ని బయటకు తీసికెళ్ళండి" వచ్చిన కోపాన్ని అణుచుకుంటూ సాధ్యమైనంత కూల్‌గా అంది నిశాంత.

"నేనెవర్నో తెలిసే మాట్లాడుతున్నావా? ఎస్ ఐ ని ఫైఫ్ మినిట్స్‌లో నీ హోటల్‌ని స్మాష్ చేసేస్తాను" బాగా తాగడంవల్ల వూగిపోతున్నాడతను......

అదే సమయంలో ఒక వ్యక్తి పోలీస్ యూనిఫారంలో లోని కొచ్చాడు. హెడ్ కానిస్టేబుల్‌గా తనని తాను పరిచయం చేసుకుని-

"సారీ మేడమ్! కొత్తగా వచ్చిన ఎస్ఐ ఈ హోటల్ గురించి తెలీదు. రండి సార్.......వెళ్దాం" ఎస్. ఐ. చేతిని పట్టుకున్నాడు.

"ఎవడ్రా నువ్వు........నన్ను తీసికెళ్ళడానికి నువ్వెవడివిరా? ఏయ్.......నిన్నే.....బాటిల్ తెప్పించు......బాటిల్‌కే కాదు.....నీక్కూడా రేటెంత......ఇస్తాన్లే" జేబులో చెయ్యి పెట్టి డబ్బు తీశాడు.

మఫ్టీలో వున్న ఆ ఎస్.ఐ వైపు సూటిగా చూసి కోపంగా లేచినిలబడింది నిశాంత.

ఆ డబ్బును ఆమెకివ్వబోయాడు ఆ ఎస్.ఐ. మీదిమీది కొస్తున్న ఎస్.ఐ. ని ఎలా వారించాలో అర్థం కాలేదు ఆమెకు.

"గెట్‌వుట్ ఫ్రమ్ హియర్" చాచిపెట్టి ఒక్కటిచ్చింది. ఆ దెబ్బకు కళ్లు బైర్లు కమ్మాయి ఆ ఎస్. ఐకి.

"ఐ విల్ సీ యువర్ ఎండ్" అరుస్తూ ముందుకు రాబోయిన ఎస్.ఐని వెనక్కి లాక్కెళ్ళుతున్నాడు హెడ్‌కానిస్టేబుల్. కొంతమందిలో సప్లయర్స్ తోడయ్యారు.

ఎస్.ఐని ఎక్కించుకుని పోలీస్‌జీప్ వెళ్ళిపోతున్న సమయంలోనికొచ్చాడు మేనేజర్.

"అతనితో గొడవ పడ్డారా మేడమ్? కన్నింగ్ ఫెలో......ఏవయినా చేసే మనిషి."

"ఎస్.పి. రిపోర్ట్ చేస్తే సరి, తిక్క కుదురుతుంది" చిరాగ్గా అంది నిశాంత.

"ఆ ఎస్.పి. సపోర్ట్ అంతా ఆ ఎస్.పి. యే మేడమ్ ......రెలెటివ్ అట" చెప్పాడు మేనేజర్.

"ఎస్. పికి రెలెటివ్ అయితే ఏం చేస్తాట్ట? తాగి రావడం, చిందు లాడడం, అసభ్యంగా ప్రవర్తించడం తప్పుకదా.......చూద్దాం......ఇలాంటి వాళ్ళని చాలామందిని చూశాను" అంటూ తన రూమ్‌లో కెళ్ళిపోయింది.

నిశాంత మనోధైర్యానికి ఆశ్చర్యపడ్డాడు మేనేజర్.

*     *     *     *     *     *     *     *     *     *     *

మూడు రోజులు గడిచాయి.

ఆదివారం కావడం వల్ల రెస్టారెంటు టూరిస్ట్‌లతో బిజీగా వుంది.

మంచు కొండల మీంచి పాక్కుంటూ వస్తున్న చీకటి తెర నగరం మీద నెమ్మదిగా వాలుతోంది.

రెస్టారెంటుకు కొంచెం దూరంలో ఆగింది జీపు. ఆ జీపులో స్టీరింగు పక్కన కూర్చున్నాడు సబ్-ఇన్స్‌పెక్టర్.

జీపు వెనక నుంచి ఒక వ్య క్తి దిగి ముందుకొచ్చి ఇన్స్‌పెక్టర్ కెదురుగా చేతులు కట్టుకుని నుంచున్నాడు.

"ఇదిగో బాటిల్" అని తన దగ్గరున్న క్వార్టర్ బాటిల్ విస్కీ సీసాను ఆ వ్య క్తి చేతిలో పెట్టి-

"చెప్పింది అర్థ మైందిగా......సరిగ్గా పది హేను నిమిషాల తర్వాత నేనొస్తాను" కసితో రెస్టారెంటు వైపు చెప్పాడు సబ్-ఇన్స్‌పెక్టర్.

"ఎస్ సర్!" ఆ బాటిల్‌ను ఫ్యాంటు జేబులో పెట్టుకుని రెస్టారెంటు మెట్లెక్కాడతను.

లోనికి నడిచి కార్నర్ సీట్లో కూర్చుని సప్లయర్‌ని పిలిచి థమ్స్‌అప్‌ని తెప్పించుకున్నాడు.

సప్లయర్ అక్కడనుంచి వెళ్ళిపోగానే నాలుగువేపులా ఒకసారి చూసి థమ్స్ అప్‌లోని డ్రింక్‌ని విండోలోంచి బయటకు వం పేసి ప్యాంటు జేబులోంచి విస్కీ బాటిల్‌ని తీసి, ఓ పెన్ చేసి అప్ బాటిల్లో  పోసి బాటిల్ ని కుర్చీ వెనగ్గా పడేసి థమ్స్ అఫ్ బాటిల్లోని విస్కీని సిప్ చేయడం ప్రారంభించాడు.

పది నిమిషాలు గడిచాయి.

గేటు ముందాగిన ఎక్సైజ్ డిపార్ట్‌మెంటు జీప్‌ని చూడగానే కౌంటర్లోంచి బయటికొచ్చాడు మేనేజర్.

ఎక్సైజ్ సబ్-ఇన్‌పెక్టర్ నేరుగా మేనేజర్ దగ్గరకొచ్చాడు.

"మీ హోటల్లో కస్టమర్స్‌కి లిక్కర్ సప్లయ్ చేస్తున్నారని తెలిసింది.  చెక్ చేయాలి."

సిబ్బందితో లోనికెళుతున్న ఇన్స్‌పెక్టర్ వైపు నిస్సహాయంగా చూస్తూ ఏం చేయాలో తోచక నిశాంత రూమ్‌లోకి పరుగెత్తాడు మేనేజర్.

గాభరాగా తన రూమ్‌లోకొచ్చిన మేనేజర్ వైపు తలెత్తి చూసింది నిశాంత.

"మేడమ్ అప్పుడే చెప్పాను.....ఆ ఎస్.ఐ. తో గొడవపడొద్దని చూడండి ఇప్పుడేమైందో" జరిగిందంతా చెప్పాడు మేనేజర్.

ఆమె నిర్ఘాంతపోయింది. అయినా క్షణాల్లో తేరుకుంది.

"మనం డ్రింక్‌ని చెయ్యడం లేదు.....సప్లయ్ చెయ్యడం లేదు మనకెందుకు బెంగ?"

"లేదు మేడమ్! మన రెస్టారెంటుని మూయించడానికి ఆ ఎస్.ఐ. ఆడిస్తున్న డ్రామా యిది. మన మీద ఏదో ఒక కేసు బుక్ చేయించడానికే ఈ రైడింగ్."

"ఏం చేద్దాం?" అనవసరంగా యీ గొడవలో యిరుక్కోవడం ఆమెకు బాధగా వుంది.

రేపు యీ విషయం దేశ్‌ముఖ్‌కి తెలిస్తే?

అసలా డ్రామా ఆ ఎస్ఐతో ఆడిస్తున్నది దేశ్‌ముఖేనని ఆమెకు తెలిస్తే ఎలా రియాక్టయ్యేదో!

ధైర్యాన్ని కూడగట్టుకుని రూమ్‌లోంచి బయటికొచ్చిందామె.

వరుసగా ఇరవై వరసల్లో టేబుల్స్ వున్నాయి. ఆ వెనక ఏ.సి. ఫ్యామిలీ రూమ్స్.

ఎక్సయిజ్ పోలీసులు ఒక్కొక్క టేబుల్ దగ్గరకెళ్ళి గ్లాసుల్నీ, కూల్‌డ్రింక్ బాటిల్స్‌ని టెస్ట్ చేస్తున్నారు.

చివరి వరసలో చివరగా కూర్చున్న రామ్‌లాల్ తీవిగా సిగరెట్ పొగను వదుల్తున్నాడు. తన దగ్గరకే ఎక్సయిజ్ ఇన్స్‌పెక్టర్ వస్తాడని తెలుసు- అతని రాకకోసం ఎదురుచూస్తున్నాడు.

సరిగ్గా-

అదే సమయంలో రామ్‌లాల్‌కి ప్యారలల్ రోలో కూర్చున్న సిద్ధార్థ చికాగ్గా నాలుగువేపులా చూస్తున్నాడు.

ఆ సమయానికి అతను అక్కడకొస్తాడని నిశాంతకు తెలీకపోయినా దేశ్‌ముఖ్‌కి తెలుసు.

సరిగ్గా పావుగంట క్రితం అక్కడకొచ్చాడతను.

రెండు గంటల్నించి సిటీ అన్ని హోటల్స్‌నీ వెతుకుతున్నాడు అతను......ఎక్కడయినా అకస్మాత్తుగా నిశాంత కన్పిస్తుందేమోస్తున్న అశతోలోనికొచ్చిన అతను-

కౌంటర్ దగ్గర నిలువెత్తు ఫోటోని చూడగానే అప్రతిభుడయ్యాడు. తేరుకున్న అతను బేరర్‌ని కేకేసాడు.